క్లుప్తంగా

ప్రతిభావంతులైన విద్యార్థినులకు అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు కన్న మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద సన్మానించారు. నగరానికి చెందిన అరసపల్లి వెంకట కోటేశ్వరరావు తనయ మోహనశ్రీ టెన్త్‌లో 589 మార్కులతో పాటు సయ్యద్ అహ్మద్ తనయ ఆఫ్రిన్ టెన్త్‌లో 583 మార్కులు సాధించినట్లు కన్నా మిత్ర మండలి అధ్యక్షుడు జి.కన్న తెలిపారు. అదే విధంగా అరసపల్లి రాధాదేవి సీనియర్ ఇంటర్‌లో 981 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు టెన్త్; ఇంటర్‌లలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు సాంబశివరావు, గుంటక శ్రీనివాసరెడ్డి, గురువారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పొట్టి నాగేశ్వరరావు, శ్రీహరి, ఆదినారాయణ పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజస్వామి కళావేదికపై ఆదివారం రాత్రి శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నెల వారి కార్యక్రమంలో భాగంగా యువ కళాకారులతో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. కుమారి మల్లాది సింధురాగేశ్వరి శ్రీత్యాగరాజస్వామి కీర్తనలు, వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా అలరించారు. వయోలిన్‌పై కె.కామాక్షి(విజయవాడ), మృదంగంపై మల్లాది శివానంద యశస్వి వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, కోశాధికారి రవీంద్రనాథ్ సత్కరించారు.

ఆడపిల్లలను చదివించాలి



గుంటూరు మెడికల్: ఆడ పిల్లలను ప్రతి ఒక్కరూ చదివించాలని గుంటూరు హోప్ విన్ హాస్పిటల్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. స్థానిక ఆర్టీసీ కాలనీ ఇండియన్ బ్లూమ్స్ స్కూల్ వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదువులతో ప్రతి ఒక్కరు ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



గుంటూరు రూరల్: జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరం తెలుసుకోవటం వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మాల స్థాపన జరుగుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి హిందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలంలోని కాట్రపాడు, చముళ్ళమూడి గ్రామాల్లో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంతం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కృష్ణారావు, రొంపిచర్ల రామకృష్ణ, శివలింగంనాయక్, హరిబాబు, పట్టాభిశ్రీను, సుబ్బారావు, ప్రకాష్, అన్నపూర్ణ, ప్యారమ్మ, షైనీ, విద్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు వార్డులలో రోడ్డు షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు తెనాలి పట్టణ పరిధిలోని 16, 17, 18, 19, 20 వార్డులలో రోడ్డు షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రోడ్డు షోలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కూటమి రాజకీయాలను ప్రజలు నమ్మరు

వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన కూటమి కల్తీ రాజకీయాలను నమ్మే పరిస్థితుల్లో లేరని వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 15వ డివిజన్ రెడ్లబజారులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమం , చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. ముందుకు సాగారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమాన్ని ప్రజలకు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి.. తాను మంచి చేస్తేనే ఓటు వేయండని అని సూటిగా అడుగుతూ.. మన ముందుకు వస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, కచ్చితంగా రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర రామనబోయిన అజయ్‌యాదవ్, వైఎస్సార్ సీపీ నేతలు మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వాకా శ్రీనివాస రెడ్డి, నాహిద్, గుదే నాగేశ్వరరావు, మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, హనుమాయమ్మ, అంజిరెడ్డి, బొల్లా కృష్ణారెడ్డి, రాంబాబు, చంద్రారెడ్డి, నరసింహారావు, సన్నీ, గోపి, తాటి హనుమంతరావు, చెంచయ్య పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో నూరిఫాతిమా



ప్రచారంలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న నూరిఫాతిమా

వైఎస్సార్ సీపీలో చేరిక....

వైఎస్సార్ సీపీ నేత జహీంగీర్ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో షేక్ నూరిఫాతిమా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై.. ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని వివరించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, అలీ, జమీర్, అబీద్, హుస్సేన్, సుభాని, ఫిరోజ్, షాహిద్, అర్బాజ్ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కోరారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నల్లచెరువు, సంగడిగుంట తదితర ప్రాంతాలలో పర్యటించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే గుంటూరు ఎంపీగా కిలారి రోశయ్య, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలుగా షేక్ నూరి ఫాతిమా, విడదల రజినిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పేదల భద్రతకు భరోసాగా మేనిఫెస్టో కాపీని ఉంచుకుని ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి జగనన్న ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఎమ్మెల్సీకి స్థానికులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ నేతలు షేక్ ఖాజామొహిద్దీన్, పల్లపు మహేష్, యద్దనపల్లి బాలరాజు, సోమి కమల్, కొరిటిపాటి ప్రేమ్ కుమార్, కొమ్మేర రాము, మల్లవరపు బుజ్జి, షేక్ ఇస్మాయిల్, బొబ్బిలి శీను, కామిశెట్టి మధు, షేక్ జానీ, షేక్ నాగుల్, షేక్ నాగూర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, చిల్ల రాజా, స్టాంపుల రమణ, పల్లపు దుర్గాప్రసాద్, అంజిబాబు, మల్లె పవన్, సుల్తాన్, వై అవినాష్, కోర్లె అశోక్, ఫాతిమా, షకీలా బేగం, సుజాత, అనసూయ, అంజన, సాయి, ముత్తురాజు, షేక్ సుభాని, షేక్ సుల్తాన్, కొత్తపల్లి మణిరెడ్డి, ధోర్నాల పండు, శివ, వల్లేపు శివ,శివారెడ్డి, రామరాజు, ఇనాయతుల్లా, కరీం, కాశిం, కిరణ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి హారతి ఇస్తున్న మహిళ

విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ప్రతిభా పురస్కారాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ- జేఈఈ, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ఆదివారం ప్రదానం చేశారు. స్థానిక చంద్రమౌళీనగర్‌లోని అకాడమీ క్యాంపస్ వద్ద నిర్వహించిన ప్రతిభా పురస్కార్ మహోత్సవంలో భాగంగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 570కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఆహ్వానించి, సత్కరించడం ద్వారా వారిలో స్ఫూర్తిని నింపినట్లయిందని అన్నారు. ఈసందర్భంగా కార్యక్రమానికి హాజరైన 500 మంది విద్యార్థులను సత్కరించి, ప్రతిభాపత్రం, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎస్. విజయభాస్కర్ రెడ్డి, జోసఫ్‌రెడ్డి, డీన్ కె. సాంబశివరావు, ఏజీఎం ఏడుకొండలు, సీఈవో సన్నీ, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ అమీనాబేగం పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఫ్రాన్సిస్‌రెడ్డి

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మల్లికార్జునపేట 5వ లైన్‌లో నివాసించే సిహెచ్.శ్రీనివాసరావు(47) అప్పులబాధతో ఆదివారం బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.20 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: ఎలాంటి రసీదులు లేకుండా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం తాడికొండ మండలం కంతేరు శ్రీ సిటీ సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన వరగాని భాను చందర్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై రూ.1.20 లక్షల నగదు పెట్టుకొని వెళ్తుండగా తనిఖీలు నిర్వహించారు. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేని కారణంగా తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, ఐటీ అధికారులకు పంపించినట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవం(మహా మంజీరనాదం-2024) ఆదివారం ఆరో రోజుకి చేరాయి. ప్రముఖ గాయని పత్రి నిర్మలమదన్ జ్యోతి ప్రజ్వలన చేయగా, సభకు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం మొహిముద్దీన్‌ఖాన్ (ప్రొద్దుటూరు) నృత్య ప్రదర్శన, అభిశ్రీ మోల్ (తిరువనంతపురం) మోహినీ ఆట్టం, రుత్విక నలమలవు(కర్ణాటక) కూచిపూడి నాట్యం, కె.హరిప్రసాదరావు(తిరుపతి) భరతనాట్యం ప్రదర్శించారు. వారి నృత్యాలు సభికులు, ప్రేక్షకులను అలరించాయి. మొహిముద్దీన్‌ఖాన్‌కు నృత్య శిరోమణి పురస్కారం, కొందరికి యువ కళారత్న పురస్కారాలు, ఎస్‌వీ సంగీత నృత్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్. జమునా రాణికి 'మరంగంటి కాంచనమాల' జీవిత సాఫల్య పురస్కారం, ప్రపంచ ప్రఖ్యాత నాట్యాచార్యుడు డాక్టర్ ఎస్.కృష్ణకుమార్‌ను వసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభలో ప్రముఖ వైద్యులు, రచయిత్రి భార్గవి, వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం, సంస్థ కార్యదర్శి వెంకటగిరి నాగలక్ష్మి, బిక్కీ అలేఖ్య పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన

ఇండియా కూటమిని గెలిపించండి

లక్ష్మీపురం: ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ప్రత్తిపాడు నియోజక వర్గ అసెంబ్లీ అభ్యర్థి కొరివి వినయ్‌కుమార్, జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, జంగాల చైతన్య, సోమేపల్లి వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి- కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపరిచిన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ రాచకొండ జాన్ బాబు స్థానిక అశోక్ నగర్, లక్ష్మీపురం, గార్డెన్స్ మెయిన్, కృష్ణా నగర్ రోడ్డులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

తెనాలి: పట్టణ సుల్తానాబాద్‌లోని సరస్వతి శిశుమందిర్ విద్యార్థులకు శనివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగిన వేడుకకు శిశుమందిర్ సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహించారు. గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, విద్యాపీఠం విజయవాడ సమితి కార్యదర్శి కొసనం జగదీష్ సందేశాన్ని వినిపించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు రమాదేవి స్వాగతం పలికారు. విద్యాకమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు పర్యవేక్షించారు. విద్యాకమిటీ కార్యదర్శి దూళ్ల నరసింహారావు, కమిటీ సభ్యులు యక్కల శ్రీమన్నారాయణ, పొత్తూరు నాగేంద్రం, అవ్వారు లత, కొత్త దీప్తి, కాజా శివప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు.



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులతో అతిథులు

ప్రతి ఓటరూ ఓటు వేసేలా చూడాలి

మంగళగిరి: ప్రతి బూత్‌లోను ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న కన్వెన్షన్ సెంటరులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని బూత్‌లలో ఓటు హక్కు ఉన్న వారందరు వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి ప్రజలకు చేరువైందని, రానున్న ఎన్నికల్లో ప్రజల ఆదరణతో ఆయన మళ్లీ సీఎం కావడంతో పాటు మంగళగిరి నియోజకవర్గంలో మురుగుడు లావణ్య విజయం తథ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడేపల్లి మంగళగిరి, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, బుర్రముక్క వేణుగోపాలస్వామిరెడ్డి, మున్నంగి వివేకానంద రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, పట్టణ , రూరల్ జేసీఎస్ కన్వీనర్‌లు ఎండి ఫిరోజ్, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి నాయకులు సంకె సునీత, ఈపూరి ఆదామ్, బేతపూడి నరసయ్య పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణకు భాష కీలకం

తెనాలి: అక్షరం భాషకు ప్రాణం పోస్తుందని, అలాంటి భాషను అచ్చుయంత్రం అజరామరం చేసిందని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో ఆదివారం రాత్రి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. 'మానవ వికాసంలో ముద్రణా వికాసం' అనే అంశంపై ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ప్రత్యేక ప్రసంగం చేశారు. మానవ వికాసంలో భాష ప్రాధాన్యత, అందుకు తోడ్పడిన ముద్రణా పరిణామాన్ని సోదాహరణంగా వివరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, చలమయ్య, వాకా పేరిరెడ్డి, అజ్గర్‌అలీ పాల్గొన్నారు.



ఆచార్య కృపాచారిని సత్కరించిన అసోసియేషన్ నేతలు

వివాహ పరిచయ వేదికకు స్పందన

తెనాలిఅర్బన్: ది పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్తెంశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో ఆదివారం వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పద్మశాలీయ యువతీ, యువకులు హాజరయ్యే పరిచయ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వధూవరుల వివాహ పరిచయ వేదికకు వివిధ ప్రాంతాల్నుంచి 246 మంది యువతీ యువకులు తల్లిదండ్రులతో సహా హాజరయ్యారు. కొందరు సంప్రదింపులు జరుపుకున్నారు. ఇదే వేదికపై వధూవరుల వివరాలు తెలియజేసే పుస్తకాన్ని ఆవిష్కరించారు. నిత్య అన్నదానం నిర్వహిస్తున్న పంచుమర్తి బాలచంద్రుడు, తిరువీధుల మల్లికార్జునరావు, గవని సతీష్ బాబు దంపతులను ఘనంగా సత్కరించారు. పద్మశాలి వెల్ఫేర్ సొసైటీకి చెందిన శిల్పి అక్కల శ్రీరామ్ నిత్యాన్నదానం చేస్తున్నందుకు అభినందించారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌చంద్, సంస్థ ప్రతినిధులు జొన్నాదుల మహేష్, అక్కల శ్రీరామ్, దివి పురుషోత్తం, గంజి ప్రభాకర రావు, శేషగిరిరావు, ఓంకార ప్రసాద్ పాల్గొన్నారు.



సేవకులను సత్కరించిన నిర్వాహకులు

300మందికి వైద్య పరీక్షలు

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ డి3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్ ఎన్‌క్లేవ్ భవనం ఆవరణలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరం కొనసాగించారు. పేర్లు నమోదు చేసుకున్న 300 మందికి సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ డి.శారద ఉచితంగా బీపీ, షుగరు, ఫిజియోథెరపీ పరీక్షలు చేశారు. ఈసీజీ తీశారు. అవసరమైన వారికి నెలకు సరిపడ బీపీ, కాల్షియం, విటమిన్ మందులు ఉచితంగా అందజేశారు. శిబిరానికి హాజరైన అందరికీ అల్పాహారం సమకూర్చారు. పావులూరి ట్రస్ట్ చైర్మన్ పావులూరి శ్రీనివాసరావు, పావులూరి భానుమూర్తి, శ్రీశైల భక్త సేవాసమితి సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.



తనిఖీల్లో నగదు పట్టివేత

తెనాలిరూరల్: తెనాలి మండలం బుర్రిపాలెం, నందివెలుగు గ్రామాల కూడళ్లలో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద బిల్లులు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు ఆదివారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బుర్రిపాలెం గ్రామం దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన తంగెళ్ళ ప్రసాద్‌రాజు బైక్‌లో రూ.లక్ష నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నందివెలుగు చెక్ పోస్టు వద్ద ఇన్నోవా కార్లో వెళ్తున్న వేమూరుకు చెందిన కోగంటి శివజ్యోతి వద్ద రూ.1.20 లక్షలకు సరైన బిల్లులు చూపకపోవటంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించండి

తెనాలిఅర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించాలని ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ సూచించారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థుల స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించాలన్నారు. చిన్నతనం నుంచే విలువలతో కూడిన విద్యను అలవాటు చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సీఆర్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ భేటీ



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

నాదెండ్ల: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి గణపవరం చుండి రంగనాయకులు పాలిటెక్నిక్ కళాశాల వేదికైంది. ఈ కళాశాలలో 1999 నుంచి 2002 వరకూ డిప్లమా పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన సమావేశానికి కళాశాల అధ్యక్షుడు చుండి విజయసారధి, ప్రిన్సిపల్ పి.లక్ష్మీరాజ్యాం, డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, నాటి అధ్యాపకులు ఆంజనేయులు, గౌస్‌లాజం, రాజశేఖర్, వెంకటేశ్వర రెడ్డి, మధుసూదనరావు, శ్రీనివాసరావు, వీరబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. వీరిని శాలువాలు, పూలమాలలతో పూర్వ విద్యార్థులు సత్కరించారు. కళాశాల అధ్యక్షుడు చుండి విజయసారధి మాట్లాడుతూ, తమ కళాశాలలో చదివిన విద్యార్థులు అనేక రంగాల్లో విజేతలుగా ఎదగటం కళాశాలకే కాక, ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. ముందుగా తమతో విద్యాభ్యా సం చేసిన పలువురు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది మృతి పట్ల మౌనం పాటించారు. అనంతరం విద్యార్థులు వ్యక్తిగత పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు రాలేకపోయారని, త్వరలో హైదరాబాద్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వా హకులు వి.నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న వారు, స్వంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు, సంస్థలు నడుపుతున్న వారు మాట్లాడారు. సాయంత్రం వరకూ కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా గడిపారు.

డాక్టరేట్ అందుకున్న పూర్ణ ప్రజ్ఞాచారి

తెనాలిరూరల్: హైదరాబాద్‌లోని తెలుగు సంస్కృతి సాంస్కృతిక సేవా సంస్థ ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్‌ను సాహితీరత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి అందుకున్నారు. హైదరాబాద్ చిక్కడ్‌పల్లి త్యాగరాయ గాన సభావేదికపై ఆదివారం సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంజీ శంకర్, వేదాంత పండితులు సుబ్బరాయ శర్మ, ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ కేసరి జనార్దనరావు, కమెడియన్ అప్పారావులు పూర్ణ ప్రజ్ఞాచారికి గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ మేరకు వివరాలను ప్రజ్ఞాచారి వెల్లడించారు. తన తండ్రి మధురకవి నూతక్కి అబ్రహంకు డాక్టరేట్‌ను అంకితం చేస్తున్నట్టు తెలిపారు. తన స్వగ్రామం తెనాలి మండలం కొలకలూరు గ్రామ కళాకారులకు, కళాభిమానులకు, కళా పోషకులకు ఈ గౌరవం దక్కినట్లేనని పేర్కొన్నారు.

